విశాలాంధ్ర గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

క్లీన్ కాకినాడకు సహకరించండి

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజల సహకారం కూడా ఉన్నప్పుడే నగరాన్ని-క్లీన్ కాకినాడగా తీర్చిదిద్ద గలమని నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ పేర్కొన్నారు. గురువారం ఆయన 50వ డివిజన్ గైగోలుపాడు ప్రాంతంలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలు నివాసాల వద్దకు వెళ్లి తడి-పొడి చెత్తను వేరువేరుగా ఇస్తున్నారో లేదో పరిశీలించారు. బహుళ అంతస్తుల భవనాల వద్ద కూడా చెత్తను విభజించి ఇస్తున్న తీరును పర్యవేక్షించారు. తడి-పొడి చెత్తను వేరువేరుగా ఇవ్వాల్సిన ఆవశ్యకతను ఆయన ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ఉత్పత్తి అయిన ప్రాంతంలోనే తడి-పొడి చెత్తగా విభజించాల్సి ఉంటుందన్నారు. అలా చేయడం వల్ల ప్రాసెసింగ్ ప్రక్రియ సులభతరమ వుతుందన్నారు. చెత్తను రోడ్ల పైన, డ్రైన్‌లలోను వేయొద్దని కమిషనర్ సూచించారు. ఆ దిశగా సానిటరీ ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులు ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని కోరారు.

కుష్టువ్యాధి ఇంటింటి సర్వే

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : మండలం అంబేద్కర్ కోనసీమ జిల్లా. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగర వైద్యాధికారులు డాక్టర్ పిఎస్ఎస్ డి.రత్న కుమారి, డాక్టర్ జె.అనూజ ప్రియాంక ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంగరలో "కుష్టు వ్యాధి ఇంటింటి సర్వే కార్యక్రమం (ఎల్‌సిడిసి)"లో భాగంగా ఆరోగ్య కార్యకర్తలకు ఆశా కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఈనెల 15 నుండి డిసెంబరు 5 వరకు జరుగుతుంది. ఈ కార్యక్రమంలో క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్త, గ్రామ వాలంటీరు టీంగా ఏర్పడి రోజుకు సుమారు 20 గృహాలను దర్శించి ఆయా గృహాల కుటుంబ సభ్యులందరినీ కుష్టు వ్యాధి చిహ్నాలు, లక్షణాలను పరీక్షిస్తారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ బి. రామారావు, హెల్త్ సూపర్వైజర్ పి. సురేష్, లెప్రసీ నోడల్ పర్సన్ వి. వెంకటేశ్వర్లు, టి. రామకృష్ణారావు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, అంగన్వాడీలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర - పెదపూడి : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట కోతలు వచ్చేసరికి సరైన విధానం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతుల ఇబ్బందులను తొలగించాలని, ధాన్యం కొనుగోలు నిబంధనలు సరళీకృతం చేయాలని, తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, టిడిపి శ్రేణులు గురువారం ఎంపిడీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. దానికి ముందు నేలపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నిబంధనలు సరళీకృతం చేయాలంటూ కలెక్టర్‌ను కోరుతూ వాటి నకలును కాకినాడ ఆర్డీవోకి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, పార్టీ మండల నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కృష్ణ, పార్టీ తూ.గో. జిల్లా అధికార ప్రతినిధి కర్రి వెంకటరామరెడ్డి, తూర్పు జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు సిరసపల్లి నాగేశ్వరరావు, రాష్ట్ర వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి గంగాధర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సెల్ కన్వీనర్‌గా నరేంద్ర

విశాలాంధ్ర - గోకవరం : గోకవరం ఎస్సీ సెల్ టౌన్ కన్వీనర్‌గా జనసేన పార్టీకి చెందిన నేతల నరేంద్రను నియమించినట్లు జగ్గంపేట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాఠం శెట్టి సూర్యచంద్ర విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా కాటన్ శెట్టి సూర్యచంద్ర మాట్లాడుతూ దళిత యువతలో మంచి ఆదరణ కలిగిన మేకల నరేంద్రను ముందు ఉంచడం వల్ల గోకవరం టౌన్‌లో జనసేన పార్టీ మరింత పటిష్టమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి సుబ్బారావు, గోకవరం మండలం జనసేన పార్టీ అధ్యక్షుడు ఉంగరాల మణిరత్నం, కదిలం మురళి, ప్రగడపాక ఉంగరాల శివాజీ, జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - అనపర్తి : గ్రంథాలయాల్లో కేవలం విద్యకు సంబంధించిన అంశాలే కాకుండా మేధా సంపత్తిని పెంపొందించు కోవడానికి ఎన్నో రకాల పుస్తకాలు లభ్యం అవుతాయని ఈ అవకాశాన్ని విద్యార్థులు, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక గంగిరెడ్డి నర్సింగ్ హెూమ్ ఆవరణలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవం పురస్కరించు కుని ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తేతలి నారాయణరెడ్డి, గ్రంథాలయ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి కలిగి ఉండాలి

విశాలాంధ్ర- దేవరపల్లి : విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించుకుని ప్రపంచ శాంతికి, అభివృద్ధికి దోహదపడాలని సామాజిక విశ్లేషకులు సుంక వెల్లి సత్యనారాయణ అన్నారు. త్యాజంపూడి జిల్లా పరిషత్ హై స్కూల్లో గురువారం ప్రపంచ సైన్స్ దినోత్సవం సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు నవ సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులు లక్ష్మీదేవి, జై శ్రీహరి రామ్, ఎం. కీర్తనలకు నగదు బహుమతులు, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు విరాట్, ఉపాధ్యాయులు మధులత, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో ఏలేశ్వరం తాలూకా యూనిట్ అధ్యక్షునిగా పొన్నాల

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఏలేశ్వరం తాలూకా యూనిట్ అధ్యక్షునిగా ఎస్. పొన్నాల(ఆర్ఐ తహసీల్దార్ కార్యాలయం) ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ఎన్నికల పర్యవేక్షణ అధికారి జిల్లా సంయుక్త కార్యదర్శి దేవిడ్ ఎలయాజర్ ప్రకటించారు. ఈ మేరకు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన ఎన్నికల ప్రక్రియ దేవిడ్ పర్యవేక్షణలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక పదవికి ఒక నామి నేషన్ రావడంతో సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించా మన్నారు. అసోసియేట్ అధ్యక్షునిగా ఆర్. రాజబాబు, ఉపాధ్యక్షులుగా వి.వెంకటరమణ, సిహెచ్ కిరణ్ కుమార్, ఎంవిఎస్ రాజగోపాల్, కార్యదర్శిగా యంవిఆర్ఆర్ వర్మ ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. నూతన అధ్యక్షుడు పొన్నాల మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తా అన్నారు. పిఠాపురం అధ్యక్షుడు ఎ. కృష్ణ, పి. సురేష్ కుమార్, గుద్దటి రామ్మోహనరావు, పేపకాయల వెంకటకృష్ణ పాలకుర్తి మూర్తి బాబు, సరేళ్ళ చంద్రరావు, కెవిఎస్‌వి ప్రసాద్‌లు నూతన కార్యవర్గ సభ్యులు అభినందించారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై దృష్టి సారించాలి

అధికారులకు కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఆదేశాలు

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్ర ప్రభుత్వం సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్.డి.జి.) సాధనకు అత్యంత ప్రాధాన్యమిస్తోందని..ఈ నేపథ్యంలో ఎస్డీజీ లక్ష్యాల సాధనకు జిల్లా స్థాయిలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి వివిధ శాఖల ఉన్నతాధికారులు ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలు, పథకాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీకి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ, అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్ జైన్..అధికారులతో కలసి హాజరయ్యారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు, ఆధార్ ప్రత్యేక శిబిరాలు, ఈబీసీ నేస్తం, జగనన్న తోడు, ఏపీ సేవా సర్వేసులు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో సీపీవో పి.త్రినాథ్, డీఆర్డీఏ పీడీ కె. శ్రీరమణి, ఐసీడీఎస్ పీడీ బి. ప్రియంవద, డీఈవో డి.సుభద్ర, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం. శాంతిప్రభ, హౌసింగ్ పీడీ బి. సుధాకర్ పట్నాయక్, కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ కె. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ ఏపీ ఎన్జీవో అధ్యక్షునిగా అజీజ్

విశాలాంధ్ర - కాకినాడ : ఏపీ ఎన్జీవో కాకినాడ తాలూకా యూనిట్ అధ్యక్షునిగా ఎస్కె అజీజ్ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ కాకినాడ తాలూకా యూనిట్ ఎన్నికల ప్రక్రియకు నోటిఫికేషన్ జారీచేశారు. దానిలో భాగంగా గురువారం స్థానిక ఎన్జిఒ హెూమ్లో నామినేషన్లను తీసుకున్నారు. ఈ ఎన్నికల్లో ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. అధ్యక్షుడిగా ఎస్కె అజీజ్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం. లక్ష్మణమూర్తి, ఉపాధ్యక్షులుగా సిహెచ్ జాన్ పాల్, ఎస్కె వెంకటేశ్వర రాజు, బి శ్రీనివాసరావు, సిహెచ్ శివకుమార్, కార్యదర్శిగా ఎ. సత్తిరాజు, కార్యనిర్వాహక కార్యదర్శిగా వి. నరేష్, సంయుక్త కార్యదర్శులుగా వై.రామకృష్ణ, డి. రామమూర్తి, కె. స్వామి, కె.శివప్రసాద్, మహిళ సంయుక్త కార్యదర్శిగా యు. కమల, కోశాధికారిగా వి. శశికుమార్, కార్యనిర్వాహక సభ్యులుగా ఎం. శ్రీరాములు, ఆర్. మహేశ్వర వరప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు అధికారిగా ఎన్జీవో యూనిట్ అధ్యక్షులు బిఆర్వి చౌదరి, సహాయ ఎన్నికల అధికారిగా కె. వెంకటరత్నం, ఎన్నికల పర్యవేక్షకుడిగా పి.పాండురంగారావులు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని ఉద్దేశించి ఎన్జీవో జిల్లా అధ్యక్షులు గుద్దటి రామ్మోహన్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, జిల్లా సహాధ్యక్షులు పాలపర్తిమూర్తి బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, సరేళ్ళ చంద్రరావు, సంయుక్త కార్యదర్శి కెవిఎస్వి ప్రసాద్, జిల్లా సంయుక్త కార్యదర్శి దేవిడ్ ఎలయాజర్ తదితరులు ప్రసంగించి ఎన్నికైన వారిని అభినందించారు. సంఘ అభ్యున్నతికి అంతా కలిసి పనిచేయాలని కాకినాడ యూనిట్‌ను కోరారు.

భారీ వాహనాలతో ఛిద్రమైన రోడ్లు

విశాలాంధ్ర - రౌతులపూడి : రౌతులపూడి మండలంలో భారీ వాహనాలు పరిమితికి మించి టన్నులకొద్దీ అధిక బరువుతో నిత్యం రద్దీగా తిరుగుతుండటంతో రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. మండలంలోని ఎస్.పైడిపాల, మల్లంపేట, ములకపూడి, రాఘవపట్నం, మాతయ్యపేట పంచాయతీలలో నల్లరాతి కొండలు అధికంగా ఉండడంతో పుట్టగొడుగుల్లా క్వారీలు పుట్టుకొచ్చాయి. ఈ ప్రాంతాల నుండి దూర ప్రాంతాలకు నిత్యం నల్లరాయిని పరిమితికి మించి అధిక లోడుతో వాహనాలు తీసుకెళ్తున్నాయి. మండలంలోని ఉపప్రాణాళిక ప్రాంతాలలో రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. పెద్ద పెద్ద గుంతలు పడడంతో ప్రజల ప్రయాణానికి నిత్య నరక భయంగా మారాయి. అసలే ఇరుకైన రోడ్లు కావడంతో గుంతల రోడ్లలో ప్రయాణం భారీ వాహనాలకు తరచూ ప్రమా దాలు జరుగుతున్నాయి. సంబం ధిత అధికారులు ఎవరూ పట్టించుకోవటం లేదని, లారీలపై పర్యవేక్షణ కరువైందని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

రమణకు ఘన సన్మానం

విశాలాంధ్ర - అమలాపురం : స్థానిక శ్రీ వెంకటేశ్వరా డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇంటెర్న్‌షిప్‌లో భాగంగా సేంద్రీయ వ్యవసాయం వానపాముల తయారీ అధిక దిగుబడికి మందుల వాడకం తదితర అంశాలు పై జనుపల్లి, నల్లమిల్లి తదితర గ్రామాల్లోని రైతు భరోసా సచివాలయ కేంద్రాలవద్ద మరియు కిమ్స్ కళాశాల, వైద్యశాల, ఏరియా, ప్రభుత్వ వైద్యశాల, వివిధ వాటర్ ప్లాంట్ వద్ద శిక్షణ తరగతులకు హాజరయ్యారు. పలువురు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ అందించారు. మండల వ్యవసాయ అధికారి కె.ధర్మప్రసాద్, అప్పారి వేంకటరమణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కెవిఆర్ ఎస్ నరసింహరావు ప్రిన్సిపాల్ కె. మనోహర్ తదితరులు ఆదర్శ రైతుల సంఘం అధ్యక్షులు అప్పారి వెంకటరమణను సన్మానించారు.

ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

విశాలాంధ్ర - పెద్దాపురం : రాష్ట్రంలో ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. ఇంటింటికి ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా మండలంలోని వాలు తిమ్మాపురం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ సెంట్రల్ ట్రయల్ రన్ మెడికల్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సైనం బుల్లెమ్మ అధ్యక్షతన జరిగిన సభలో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు మాట్లాడుతూ దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యశ్రీ పథకాన్ని 108 సేవలను ప్రవేశపెట్టారన్నారు. అనంతరం గ్రామంలో సుమారు 26 లక్షల రూపాయలతో నిర్మించతలపెట్టిన పలు అభివృద్ధి పనులకుఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, కాండ్రకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సిహెచ్ ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వరసాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అలసత్వం చేయకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర - గండేపల్లి : అలసత్వం చేయకుండా రైతుల వద్ద ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలని పెద్దాపురం ఆర్డీవో సీతారామారావు అధికారులకు సూచించారు. గండేపల్లి మండలం జెడ్ రాగంపేట రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ఆకస్మిత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎక్కడా ఇబ్బందులు పడకుండా కళ్ళాల వద్దకు వెళ్లి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలోనూ సచివాలయ సిబ్బంది అధికారులు అందుబాటులో ఉంటూ రైతుల సమాచారం తీసుకుని ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఎక్కడైనా అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీడీవో బికెఎస్ఎస్ వెంకట రమణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పేదలందరికీ ఇళ్ళు అందాలి

విశాలాంధ్ర - అమలాపురం : నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు, ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాలు, కార్యక్రమాలు, పథకాల అమలు తీరుపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించి నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఆయా పనుల్లో పురోగతి చూపించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి వెలగపూడి సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయం ఉన్నతాధికారులు, గ్రామ,వార్డు సచివాలయాలు, స్పందన అర్జీల పరిష్కారం, నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల కింద నిర్మిస్తున్న గృహ నిర్మాణాల పురోగతి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి నిమిత్తం నిర్వహిస్తున్న ప్రాధాన్య కార్యక్రమాలు, పథకాల అమలుపై అధికా రులు ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. మధ్యాహ్న భోజనం, అంగన్వాడీల్లో పౌష్టికా హారం పంపిణీకి, విద్య, మహిళా శిశు సంక్షేమం, వైద్య ఆరోగ్య శాఖాధి కారులు పూర్తి సమన్వయం వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ సిహెచ్ సత్తిబాబు, జిల్లా వ్యవసాయ అధికారి వై ఆనంద కుమారి, సిపిఓ వెంకటేశ్వర్లు, డిపిఓ వి. కృష్ణకుమారి, పంచాయతీరాజ్ ఎస్ఈ చంటిబాబు, జిల్లా ఉద్యాన అధికారి ఎన్. మల్లికార్జున రావు, డిఆర్డిఏ పిడి వి. శివశంకర్ ప్రసాద్, మున్సిపల్ కమీషనర్ ఐవి నాయుడు, సర్వే విభాగపు ఎడి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం జేసీ పరిశీలన

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలు వెంటనే ప్రారంభించాలని, అందుకు అవసరమైన గోనె సంచులు సరఫరా కూడా జరిగిందని, ఎక్కడైనా యాప్ ఉపయోగించడంలో సాంకేతిక సమస్యలు వస్తే వెంటనే జిల్లా సివిల్ సప్లైస్ అధికారిని సంప్రదించాలని అన్నారు. దళారుల చేతిలో ఇబ్బంది పడకుండా రైతులందరూ ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని అన్నారు. ఈ పరిశీలనలో ఎంపీడీఓ నాతి బుజ్జి, మండల వ్యవసాయ అధికారి పట్టాభి రామయ్య, రెవిన్యూ ఇన్స్పెక్టర్ భవానీ, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, సచివాలయ వ్యవసాయ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

గుడికి వెళితే మృత్యువు వెంటాడింది

-భక్తుల పై నుంచి దూసుకెళ్లిన లారీ

-ఇద్దరు మహిళల దుర్మరణం -వెట్లపాలెంలో విషాదచాయలు

విశాలాంధ్ర - సామర్లకోట : దేవుని అనుగ్రహం కోసం గుడికి వెళ్తున్న భక్తులను మృత్యువు వెంటాడింది. లారీ రూపంలో వచ్చి వారిపై నుంచి దూసుకెళ్లగా ఇద్దరు మహిళలు మృతి చెందారు. సామర్లకోట మండలం పెద బ్రహ్మదేవం గ్రామం వద్ద జరిగిన ఈ ప్రమా దంలో వెట్లపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు దుర్మరణం చెందారు. దానితో వేట్లపాలెం గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. వివరాల్లోకి వెళితే వేట్లపాలెం జొన్నలదొడ్డి ప్రాంతానికి చెందిన ఐదుగురు మహిళలు బలభద్రపురం సాయిబాబా గుడికి దర్శనం నిమిత్తం గురువారం ఉదయం వెళ్తుండగా వారు పెదబ్రహ్మదేవం వచ్చేసరికి వెనుక నుండి లారీ వేగంగా వచ్చి ఢీకొట్టి పక్కనే ఉన్న గోదావరి కాలువలోకి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఆనందాల విజయలక్ష్మి (14) అనే బాలికతో పాటు కటారి హేమ(26) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన భక్తులు క్షేమంగా బయటపడ్డారు. మృతురాలు హేమలత భర్త టీవీ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మరో బాలిక వీరకుమారి పదవ తరగతి చదువుతోంది. సామర్లకోట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న ఇళ్ళ కాలనీలో మొదటి గృహం ప్రారంభం

విశాలాంధ్ర - తుని : మండలంలో ఎస్ అన్నవరం గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఇళ్ళ కాలనీలో లబ్ధిదారులు తమ గృహాలను తొందరగా నిర్మించుకొని సొంతింటి కలను సాకారం చేసుకొనేందుకు పరుగులు తీస్తున్నారు. ఈ గ్రామ పంచాయతీకి సుమారు 11 వందలమంది లబ్ధిదా రులకు ఇళ్ళ పట్టాలు ఇచ్చిన ప్రభుత్వం వందల గృహాలు పూర్తి స్థాయిలో ఉన్నాయి.రోడ్లు భవనాల శాఖామంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు గురువారం ఈ కాలనీలో పూర్తి కావచ్చిన మొదటి గృహాన్ని ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మంత్రి బందు వైన పోతల లక్ష్మణ్, వైస్ ఎంపిపి చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు,పంచాయతీ కార్యదర్శి ఎస్ఎస్వీ మధుశేఖర్, కుసనం శాంతి దొరబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కుసనం దొరబాబు, వంగలపూడి జెమీలు,వంగలపూడి అప్పారావు, వంగలపూడి వాసు, కీర్తి బాలకృష్ణ, వంగలపూడి గంగ తదితర వైసిపి నేతలు పాల్గొన్నారు.

IN THE COURT OF THE A.P. CO-OPERATIVE TRIBUNAL AT VIJAYAWADA
M.A. No. 37 / 2018
IN 0.A. No. 35/2018

BETWEEN:
1. The Jampeta Co-operative urban bank Ltd., Rep by its Secretary, Rajahmundry, East Godavari District. **- Appellant**

And

1. The Deputy Registrar of Co-operative Societies, Rajamahendravaram, East Godavari District.
2. The Aryapuram Co-operative Urban Bank Ltd., Rajamundry, Rep by its Secretary,
3. Md. Jameel, Slo. Ameen Saheb, D.No.44-6-20/A, Madansinghpeta, Rajahmundry. **- Respondents**

3rd Respondent: Md. Jameel, S/o. Ameen Saheb, D.No. 44-6-20/A, Madansinghpeta, Rajahmundry- 533101

Please take notice that the above appeal is filed against you and two others and said petition is **posted to 17/11/2022** for your appearance. Therefore you are hereby required to appear Before the Hon'ble AP Co-operative Tribunal At Vijayawada on **17/11/2022 at 10.30 AM.** either in person or through advocate to submit your objections, in default the matter will be decided exparte.

(By order of the Hon'ble Court)
Ganta Prasad, B.A., B.L.,
Ganta Lakshmi Bhavani, B.Com.,B.L.,
D.No. 48-7-13A, Sai sujatha Nilayam, 1st floor, ESI Hospital Road, Gunadala. Vijayawada-520004. Ph: 9393930090

సోలార్ లైట్ల పంపిణీ

విశాలాంధ్ర - మారేడుమిల్లి: అల్లూరి జిల్లా మారేడుమిల్లి మండలంలో సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో సివిక్ యాక్షన్ కార్యక్రమంలో భాగంగా సోలార్ లైట్లు పంపిణీ చేశారు. గురువారం మండల కేంద్రమైన మారేడుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ కొండ జాకబ్, జడ్పిటిసి గొర్లె బాలాజీ బాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సి ఆర్ పి ఎఫ్ 42 ఏ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ గీతమ్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్ బి. రత్నమ్మ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సిఆర్పిఎఫ్ ఎనలేని కృషి చేస్తుందన్నారు. గిరిజన ప్రాంతాలైన మారేడుమిల్లి, పుల్లంగి, సున్నంపాడు, చావడికోట పరిధిలోని గిరిజనులకు ఉచితంగా సోలార్ లైట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సున్నంపాడు పంచాయతీ సర్పంచ్ వెదురుల లచ్చిరెడ్డి,మారేడుమిల్లి సిఐ అద్దంకి శ్రీనివాసరావు, ఎస్ఐలు ఎన్.రాము, జ్వాలా సాగర్లు పాల్గొన్నారు.

అటవీ శాఖలో గిరిజనులు మమేకం

విశాలాంధ్ర -మారేడుమిల్లి : అటవీ శాఖలో గిరిజనులను మమేకం చేస్తున్నట్లు రంపచోడవరం సబ్ డిఎఫ్ఓ ఎస్.ధరణి తెలిపారు. గురు వారం మండల కేంద్రమైన మారేడు మిల్లి వనవిహారీలో ఏర్పాటుచేసిన రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఆమె మాట్లాడారు. అమరవీరులైన అటవీ సిబ్బంది త్యాగాలు ఎనలేనివన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అమరవీరుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.వన సంరక్షణతో పాటు, పర్యావరణాన్ని, వన్యప్రాణులు కాపాడటం తమ ఉద్యోగ ధర్మమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మారేడుమిల్లి మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గుడిస గ్రీన్లాండును రంపచోడవరం సబ్ డివిజన్ లో అటవీశాఖ సిబ్బందితో ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రం చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మారేడుమిల్లి అటవీ శాఖ అధికారి వెంకట దుర్గాప్రసాద్, అన్ని మండలాల అటవీ శాఖ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దంత వైద్యులను నియమించండి

విశాలాంధ్ర-కూనవరం : కూనవరం సామాజిక వైద్య కేంద్రంలో దంత వైద్యుని పోస్ట్ గత కొంతకాలంగా ఖాళీగా ఉంది. చుట్టుపక్కల గ్రామాల నుండి దంత సమస్యలతో వచ్చే రోగులను చూసేవాళ్ళులేరు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తే వేలల్లో ఫీజులు వసూళ్లు చేస్తున్నారు. కాగా దంతవైద్యుని పోస్ట్ ఖాళీగా ఉన్నప్పటికీ ఏజన్సీ ప్రాంతానికి రావడానికి ఎవరూ ఇష్టపడటం లేదని అధికారులు చెప్తున్నారు. గతంలో ఇదే ప్రభుత్వ ఆసుపత్రిలో దంత వైద్యునిగా సేవలు అందించిన అనుభవం ఉన్న గిరిజన కుటుంబానికి చెందిన వైద్యులు బీరబోయిన చైతన్య దొర కూనవరం లో పనిచేయడానికి మక్కువ చూపిస్తున్నారని సమాచారం. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని అధికారులు స్పందించి దంత వైద్యులు చైతన్య దొరను కూనవరం సిహెచ్ సి కి నియమించాల్సిందిగా స్థానిక ప్రజలకు కోరుతున్నారు.

ప్రత్యేక అవసరతల పిల్లలను ప్రత్యేకంగా చూడాలి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మానసిక అంగవైకల్యం ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ప్రత్యేకంగా చూడాలని ఎంఎస్ ట్రస్ట్ చైర్మన్, వార్డు కౌన్సిలర్ మూది నారాయణస్వామి పిలుపునిచ్చారు. ప్రముఖ న్యాయవాది చట్టం శెట్టి పుల్లయ్య, నాగమల్లేశ్వరి దంపతులు గురువారం స్థానిక భవిత మనోవికాస పాఠశాలలో విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలుగు తీసేందుకు ప్రత్యేకంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షులు అలమండ దుర్గా వెంకటప్రసాద్, ఎర్ర గణేష్, ఉపాధ్యాయులు సరస్వతి, వాణి పద్మజ తదితరులు ఉన్నారు.

సఖినేటిపల్లి మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడిగా చిట్టిబాబు

విశాలాంధ్ర - రాజోలు : సఖినేటిపల్లి మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడిగా సఖినేటిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం సఖినేటిపల్లి మండలంలో 16 గ్రామాల సర్పంచ్‌ల సమావేశం అంతర్వేదిపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద జరిగింది. ఈ సందర్భంగా మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షులుగా గొల్లమందల చిట్టిబాబు, ఉపాధ్యక్షులుగా దెందుకూరి వెంకట శ్రీహరి రాజు, కార్యదర్శిగా ముప్పర్తి అలివేలు, ట్రెజరర్‌గా పసలపూడి లక్ష్మి పద్మ మంగతాయారు, జాయింట్ సెక్రటరీగా పోతు దేవి దుర్గ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మాట్లాడుతూ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలుపుతున్నానని, ఆయా గ్రామాలలో సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని అన్నారు.

వైసీపీలో వర్గ పోరు

ఎమ్మెల్యే ఎదుటే బాహాబాహి

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : వైసీపీ క్యాడర్‌లో వర్గాల పోరు ఒక్కసారిగా గుప్పు మంది. ఎమ్మెల్యే ఎదుటే నాయకులు నువ్వెంత అంటే నువ్వెంత అని కొట్లాటకు దిగారు. కొత్తపల్లి ఊర చెరువు సెంటర్‌లో నూతనంగా నిర్మించిన విశ్రాంతి భవనాన్ని ప్రారంభించడానికి గురువారం పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా నిర్మించిన విశ్రాంతి భవనాన్ని ప్రారంభించారు. ఇంతలో ఎమ్మెల్యే స్థానికులతో మాట మంతి జరుపుతున్న క్రమంలో కొత్తపల్లి సర్పంచ్ వర్గం, వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు వర్గానికి చెందిన ఇరువురు ఒకరిని ఒకరు ఎమ్మెల్యే ఎదుటే దూషించుకున్నారు. దీన్ని గమనించిన ఎమ్మెల్యే ఇరు వర్గాల మధ్య సర్ది చెప్పాల్సిన ఎమ్మెల్యే అక్కడనుండి నెమ్మదిగా జారుకున్నారు. ఎమ్మెల్యే వెళ్లిన కొద్దిసేపటికే ఇరువర్గాల మధ్య గొడవ ముదరడంతో ఒక్కరిని ఒకరు కొట్టుకునే స్థాయికి మాటల తూటలు పెరిగాయి. దీనితో స్థానిక నాయకులు, పోలీసులు జోక్యం చేసుకుని గొడవని సద్దుమణిగేలా చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర -పెంటపాడు : మండలంలోని ఉమామహేశ్వరం గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి జాయింట్ కలెక్టర్ జెసి మురళితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఏ విధంగా కొనుగోలు చేస్తున్నారో వివరాలు పరిశీలించారు. అనంతరం కల్లాల్లో రైతులు ఎండబెట్టుకున్న ధాన్యాన్ని పరిశీలించి అందులో తేమ ఎంత శాతం ఉన్నదో పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట వివరాలు, ఎన్ని ఎకరాల లో పంట వేశారు, ఎప్పుడు కోతకోసారు , ఎప్పుడు ఇక్కడికి ధాన్యం తెచ్చారు ,ఎంత దిగుబడి వచ్చింది. తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టర్ జె.వి. మురళి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు, పెంటపాడు తహసీల్దార్, ఎంపిడిఓ, రైతు భరోసా కేంద్ర సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : స్థానిక ఉప్పర పేటకు చెందిన 28 మంది ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోగా వారి పట్టాలను అధికారులకు అందజేశామని, ఇప్పుడు పట్టాలు ఇవ్వమని అడుగుతుంటే సమాధానం లేదని పోలవరం శాసనసభ్యులు తెల్లం బాలరాజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన క్రమంలో ఉప్పరపేటలో నివసిస్తున్న గ్రామస్తులు పట్టాలు ఇప్పించాలని విషయాన్ని తెల్లం బాలరాజుకు తెలియజేయగా ఆయన ఆదేశాల మేరకు పట్టణ అధ్యక్షుడు సంకు కొండలరావు తహసీల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ పి .నాగమణికి వినతి పత్రాన్ని అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ఇంటి పట్టాలు అందజేస్తామని పేర్కొన్నారు.

తల సేమియా చిన్నారులకు రక్తమార్పిడి

విశాలాంధ్ర - ఏలూరు : ఏలూరు జిల్లా ప్రభుత్వ బోధన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ తల సేమియా భవనంలో 12 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడిని నిర్వహించినట్లు జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ బి.వి, కృష్ణారెడ్డి తెలిపారు. తల సేమియా చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులకు 30 మందికి ఉచిత భోజనం వలసపల్లి ప్రమీల జ్ఞాపకార్థం వారి భర్త వి.ఆర్.వి సత్యనారాయణ ఏర్పాటు చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ జి.చైతన్య కిరణ్, ఏ.సూర్యనారాయణ,కె.వి రమణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల నిర్మాణాలు పూర్తి చేయాలి

విశాలాంధ్ర- ముసునూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మాణం చేపడుతున్న ప్రభుత్వ భవనాలు వెంటనే పూర్తి చేయాలని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అన్నారు. గురు వారం మండలకేంద్రమైన ముసునూరు రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ దాసరి సుధ, ఎంపీడీవో బసవరాజు అచ్యుతసత్య నారాయణలతో పాటు పంచా యతీరాజ్ ఏఇ,ఆర్‌డబ్లూఎస్ ఏఇలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయాలు,రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ సెంటర్‌లను ఎంత వరకు పూర్తయ్యాయి, ఏయే భవనాలు ఏ దశలోవున్నాయో వివరాలు అడిగారు. అనంతరం కాట్రేనిపాడులో స్థలవివాదం పరిశీలించడానికివెళ్లారు.

వికలాంగులకు చేయూత

విశాలాంధ్ర - యలమంచిలి : యలమంచిలి మానసిక వికలాంగుల కేంద్రంలో శ్రీ క్షీరపుర అన్నదాన సమాజం ఆధ్వర్యంలో వికలాంగులకు రూ.40 వేల విలువగల సైకిల్, స్టిమిలేటర్ మోటర్, ఎయిర్ బ్యాగ్స్, లను జడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జి, చివటపు నాగేశ్వరరావు, అన్నదాన సమాజం ఈఓ ఏవీవీ సత్యనారాయణ, చైర్మన్ మామిడి బాబు తదితరులు పాల్గొన్నారు.

నాసా కాంటెస్ట్ కు శ్రీచైతన్య విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర - ఏలూరు : స్థానిక శాంతినగర్ లోని శ్రీచైతన్య పాఠశాలకు చెందిన 29 మంది విద్యార్థులు ప్రస్తుత విద్యా సంవత్సరానికి 'నాసా స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్' కు తమ ప్రాజెక్టు వర్క్ పూర్తి చేసి పంపిం చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక సెయింట్ థెరీసా పీజీ కళాశాల భౌతిక శాస్త్ర ఆచార్యురాలు డా. ఎ. నిర్మల జ్యోత్న్న మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పట్ల ఉత్సుకత, సృజనాత్మకత, సామాజిక బాధ్యత, ఆరోగ్యకరమైన పోటీ తత్వం, నిరంతర అభ్యాసం అలవర్చుకోవాలన్నారు.ప్రపంచ స్థితిగతులను మార్చిన అనేక గొప్ప శాస్త్రవేత్తల సేవలను కొనియాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శివ కుమారి మాట్లాడుతూ విద్యార్థుల తార్కిక ఆలోచనలతో దేశ భవిష్యత్తు ముడిపడి ఉన్నదన్నారు. నాసా స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులకు ప్రాజెక్టుకు సంబంధించిన నమూనాను అందజేస్తూ వారిలో ఉత్తేజాన్ని నింపేందుకు నాసా టీషర్టు, బుక్స్, నాసా బ్యాడ్జీలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల రీజనల్ ఇన్‌చార్జి పార్థసారథి, ఎకడమిక్ కోఆర్డినేటర్ సిహెచ్ ఉదయభాస్కర్ సభలో పాల్గొని ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. సభలో ఎకడమిక్ డీన్ జె.సంజీవ్ కుమార్, నాసా ఇన్‌చార్జి ఎ. నారాయణ, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా మార్ట్‌ల ఏర్పాటుకు ప్రాధాన్యత కల్పించాలి

విశాలాంధ్ర - ఏలూరు : జిల్లాల్లో చేయూత మహిళా మార్ట్ లు ఏర్పాటుకు ప్రాధాన్యత నివ్వాలని పంచాయతీరాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది జిల్లా కలెక్టర్లను కోరారు. గురువారం ఉపాధిహామీ, జల్ జీవన్ మిషన్, పి.ఎం.జి.ఎస్.వై, సెర్ప్ తదితర అంశాలపై తాడేపల్లి నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వ భరత్ , జెడ్పి సిఇఓ రవికుమార్, డ్వామా పిడి డి. రాంబాబు, డిఆర్డిఏ పిడి విజయరాజు, డిపిఓ ఎస్. బాలాజి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ ద్వివేది మాట్లాడుతూ జిల్లాలోని మహిళా సంఘాల ద్వారా తొలి దశలో ప్రతి మండలంలో రెండు చొప్పున మహిళా మార్టులను ఏర్పాటుచేయాలని జిల్లా కలెక్టర్లును ఆదేశించారు. తరువాత దశలో జిల్లావ్యాప్తంగా 500 నుండి 600 మహిళా మార్టులను ఏర్పాటుచేసి మహిళా సంఘ సభ్యులకు సుస్థిర ఆదాయం వచ్చేలా కృషిచేయాల న్నారు. కనీసం రూ. 5వేల నుండి 6వేల మంది సభ్యులకు ఉపాధి కలిగేలా చూడాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో లభించే అటవీ ఉత్పత్తులను మహిళా సంఘాల ద్వారా విక్రయిస్తే మరింత ఆదాయం లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. బల్క్ మిల్క్ యూనిట్స్ వీలైనంత త్వరగా పూర్తిచేస్తే పాలను అమూల్ సంస్థ తీసుకునేందుకు సిద్ధంగా ఉందని, తద్వారా ఆదాయం పెరుగుతుందని తెలిపారు.

రైతులకు అండగా ఉండాలి

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : సకాలంలో ధాన్యం కొనుగోలు పక్రియను పూర్తి చేసి రైతులకు అండగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడం ఎంత ముఖ్యమో, సకాలంలో కొనుగోలు ప్రక్రియను పూర్తిచేసి రైతులకు భరోసా కల్పించడం అంతే ముఖ్యమన్నారు. డిప్యూటీ తహసీల్దార్లు ధాన్యం కొనుగోలును పర్యవేక్షణతో పాటు, వరి కల్లాలోనికి వెళ్లి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలన్నారు. వీటి పర్యవేక్షణకు జిల్లాలోని 35 మంది డిప్యూటీ తహసీల్దార్లకు విధులను కేటాయించామన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ కుమారి డి.అఖిల, డీఎస్ఓ ఎన్.సరోజ, తాడేపల్లిగూడెం మునిసిపల్ కమిషనర్ బి.బాల స్వామి, తహసీల్దార్ వైకెవి అప్పారావు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల నిర్మాణం వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - చాట్రాయి : ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని నూజివీడు సబ్ కలెక్టర్ అర్షత్ రాజేంద్రన్ తెలిపారు. గురువారం మండలంలోని చనుబండ గ్రామంలో 1,2 సచివాలయాల పరిధిలో నిర్మాణంలో వున్న రైతు భరోసా కేంద్రాలను ఆయన పరిశీలించారు. వర్క్ ఇస్ వెరీ గుడ్ అంటూ అభినందించారు.తహశీల్దార్ విశ్వనాథరావు ఎంపిడిఓ మురళీమోహన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో చనుబండ సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి వైసీపీ మండల నాయకులువనమా వాసు తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో ఫిర్యాదులు పరిష్కరించండి

చాట్రాయి తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించిన సబ్ కలెక్టర్ స్పందనలో ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్ విశ్వనాధరావు,ఎంపిడిఓ మురళీమోహన్ ఎఒ శివశంకర్ లను ప్రభుత్వ పథకాల అమలును అడిగి తెలుసుకున్నారు.



51 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో సార్వ పంట ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభింపచేసిన అధికారు లు గురువారం నాటికి 51 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి మిల్లులకు పంపించారు. ఉదయం నుంచి జెసి అరుణ్ బాబు, ఏలూరు ఆర్డీవో పెంచల్ కిషోర్ నారాయణపురం విశాల పరపతి సొసైటీ, ఉంగుటూరు రైతు భరోసా కేంద్రాల వద్దే తిష్టవేశారు. జిల్లా అధికారులు దగ్గరుండి రైతుల నుంచి శాంపిల్స్ సేకరణ, తేమ శాతం పరీక్షలు, సంచులు ఇవ్వడం, ట్రక్కు షీటు విడుదల చేయడం వంటి శాఖాపరమైన ప్రక్రియలను పూర్తి చేశారు. ఎట్ట కేలకు ఉంగుటూరు రైతు భరోసా కేంద్రం నుంచి 51 టన్నుల ధాన్యం ను గణపవరం, భీమడోలు రైస్ మిల్లులకు పంపించారు. నారాయణపురం సొసైటీల్లో రైతులను ఉద్దేశించి అధికారులు మాట్లాడుతూ నిరంతరం సంచులు అందుబాటులో ఉంచామని రైతులు ఎలాంటి ఆందో ళన చెందనవసరం లేదన్నారు. హమాలీ ఛార్జీలు, రవాణా కిరాయిలు సైతం ధాన్యం బిల్లులతో పాటు 21 రోజుల్లో చెల్లించేలా అన్ని చర్యలు తీసుకున్నామని జేసీ అరుణ్ బాబు తెలిపారు.

కుష్టువ్యాధి రహితంగా జిల్లా

విశాలాంధ్ర - ఏలూరు : ఏలూరు జిల్లాను కుష్టువ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని జిల్లా కుష్టువ్యాధి నివారణాధికారి డాక్టర్ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో గురువారం సాయంత్రం జరిగిన కుష్టువ్యాధి గుర్తింపు, నిర్ధారణ కార్యక్రమాన్ని ప్రారంభించి కరపత్రం, బ్రోచెర్ లను విడుదల చేశారు. ఈ సందర్భంగా డా. నాగేశ్వరరావు మాట్లాడుతూ కుష్టువ్యాధిని సమాజం నుండి తరిమివేసి, జిల్లాను కుష్టువ్యాధి రహిత జిల్లాగా రూపొందించేందుకు ఈ నెల 15వ తేదీ నుండి డిసెంబర్, 5వ తేదీ వరకు ప్రతీ ఇంటికీ వెళ్లి కుష్టువ్యాధి గుర్తింపు, నిర్ధారణకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే త్వరితగతిన వ్యాధి నుండి బయటపడడమే కాక ఇతరులకు వ్యాపించకుండా కూడా చర్యలు తీసుకోవచ్చన్నారు. కుష్టువ్యాధిని మల్టీ డ్రగ్ థెరపీ విధానం ద్వారా పూర్తిగా నివారించన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఎం.డి.టి. మందులు పూర్తి ఉచితంగా లభిస్తాయన్నారు. వైద్యునిచే వ్యాధి నిర్ధారణ ఐన తరువాత మొదటి నెల వైద్యుని వద్ద, రెండవ నెల నుండి ఏ .ఎన్ .ఎం. ద్వారా ఇంటి వద్దనే మందులు తీసుకుని క్రమం తప్పకుండా వాడాలన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. రత్నకుమారి, నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ జ్యోతి, వైద్య సిబ్బంది వెంకట్, ప్రభృతులు పాల్గొన్నారు.

సమస్యలపై టీడీపీ అలుపెరుగని పోరాటం

విశాలాంధ్ర - మండపేట : సమస్యలపై టీడీపీ అలుపెరుగని పోరాటం చేస్తుందని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ నెల 13న మండపేటలో జోన్ 2 టిడిపి సమావేశం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. మండపేటలోని టీడీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నియోజకవర్గాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో జోన్ 2 సమావేశం నిర్వహిస్తున్నామని అన్నారు. మండపేటలోని బాబు అండ్ బాబు కన్వెన్షన్ హాల్లో ఈనెల 13వ తేదీ ఆదివారం ఉదయం సమావేశం ప్రారంభమవు తుందన్నారు. ఈ సమావేశానికి మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, ప్రత్తిపాటి పుల్లారావు, బండారు సత్యనారాయణమూర్తి తదితర నాయకులు హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చ చేపడతామని వెల్లడించారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పూజ

విశాలాంధ్ర - గండేపల్లి : మండల కేంద్రమైన గండేపల్లిలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయం వద్ద బుధవారం భారీ పూల అభిషేకం నిర్వహించారు. గ్రామంలోని సుమారుగా 80 మంది స్వాములు మాలధారణ వేసి గ్రామమంతా తిరుగుతూ పేడతుళ్ళు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ఆహ్వానం చేసి వివిధ రకాల అభిషేకాలు అనంతరం భారీ పూల అభిషేకం నిర్వహించారు. ఈ అభిషేకానికి సుమారుగా ఒక టన్ను పువ్వులు వాడారు. స్వాములు రకరకాల పాటలతో ఉత్సాహంగా స్వామివారి పూజ నిర్వహించారు. గురుస్వాములు మేక సత్తిబాబు స్వామి, రామకృష్ణ స్వామి, కన్నబాబు స్వామి, రామన స్వామిలు ఆధ్వర్యంలో స్వాములంతా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ పురోహితులు సత్తిబాబు వేదమంత్రాలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాలైన ఎన్‌టి రాజాపురం, రంగంపేట, రామయ్య పాలెం, సింగరంపాలెం, మురారి గ్రామాల్లోని స్వాములు మహిళలా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భారీ అన్నదానం



విశాలాంధ్ర - కిర్లంపూడి : కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామంలో వేంచేసి యున్న శ్రీ శిరిడి సాయిబాబా ఆలయం వద్ద గురువారం భారీ కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయిబాబా ఆలయం 28వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, ప్రజలు సహాయ సహకారాలతో ఏర్పాటు చేసిన ఈ కార్తీక వన సమారాధన కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, కిర్లంపూడి మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు తోట రవి, పలువురు నాయకులు పాల్గొని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి వచ్చిన భక్తులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా వడ్డన కార్యక్రమం నిర్వహించారు.

సోమేశ్వర ఆలయంలో అష్టోత్తర శత పూజలు



విశాలాంధ్ర - కలిదిండి: కార్తీక మాసం పురస్కరించుకొని కలిదిండి మండలంలోని కోరుకొల్లు కొలువై ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ సోమేశ్వర స్వామి సన్నిధిలో గురువారం అష్టోత్తర శత పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ 108 మంది దంపతులచే అష్టోత్తర శతకలన స్వపన పూజా కార్యక్రమం , శ్రీ పార్వతీ సమేత శ్రీ సోమేశ్వర స్వామి శాంతి కళ్యాణ మహోత్సవం కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. ఆలయ అర్చకులు స్వర్ణ ఉమాశంకర్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయన్నారు. భక్తులకి ఎటువంటి అసౌకర్యం తగిన ఏర్పాట్లు చేశామన్నారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ఆలయ చైర్మన్ చెన్నంశెట్టిశ్రీనివాసరావు, చెన్నం శెట్టి కృష్ణ, ఆలయ ధర్మకర్తలు వలవల గంగరాజు, గోర్తి. వెంకట కృష్ణకుమారి, చీకటి. సరళీ, నాగనబోయిన. సుధారాణి, మామిడి శెట్టి. వెంకటసుబ్బారావు, తందు. అంజమ్మ, స్వర్ణ. వెంకటేశ్వర్లు తదితరులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

తిరుపతి శృంగార వల్లభ స్వామి హుండీ ఆదాయం రూ.14.44 లక్షలు

విశాలాంధ్ర - పెద్దాపురం : పెద్దాపురం మండలం తొలి తిరుపతి శృంగార వల్లభుడు ఆలయానికి హుండీల ద్వారా 14.44.296 రూపాయల ఆదాయం సమకూరినట్లు దేవాదాయ శాఖ డిఈఒ పులి నారాయణమూర్తి తెలిపారు. దేవాదాయ శాఖ తనిఖీ అధికారిగా సహాయక కమిషనర్ సిహెచ్ రామ్మోహనరావు పర్యవేక్షణలో గురువారం ఆలయం హుండీలను లెక్కించారు. ఈ సందర్భంగా ఈఓ నారాయణమూర్తి మాట్లాడుతూ 62 రోజులు స్వామివారి హుండీల ద్వారా 14.44.296 రూపాయలు, అన్నదానం హుండీల ద్వారా 2.02.347 రూపాయలు ఆదాయం చేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్, కుంచే అమరావతితో పాటు ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు(చిన్నా) ఆలయ సిబ్బంది, కాండ్రకోట గోదావరి గ్రామీణ బ్యాంక్ సిబ్బంది, సేవా సమితి సభ్యులు, భక్త మండలి సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

సీఎన్జీ సెగ్మెంటులోకి టయోటా కిర్లోస్కర్ మోటార్

విశాలాంధ్ర-రాజమండ్రి : తన కస్టమర్ ఫస్ట్ ఫిలాసఫీకి అనుగుణంగా , టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) సీఎన్జీ సెగ్మెంట్లోకి ప్రవేశించినట్టు టీకేఎం సేల్స్ , స్ట్రాటజిక్ మార్కెటింగ్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ అతుల్ సూద్ తెలిపారు. తద్వారా టయోటా గ్లాంజాస్, అర్బన్ క్రూయిజర్ హైరైడర్ మోడల్ లైనప్ రెండింటిలోనూ వినియోగదారులు ఎంచుకోవడానికి మరిన్ని మోడళ్లను అందిస్తుందన్నారు. కస్టమర్లు ఎంచుకోవడానికి ఎకో ఫ్రెండ్లీ , చౌకైన ఆప్షన్లను అందిస్తుందని, టయోటా ఎప్పుడూ కస్టమర్ల ఆకాంక్షలపై స్పష్టమైన దృష్టి సారిస్తుందన్నారు. తాము అత్యంత డిమాండ్ ఉన్న రెండు మోడళ్ల టయోటా గ్లాంజా , అర్బన్ క్రూయిజర్ హైరైడర్ కోసం సీఎన్జీ వేరియంట్లలో డ్రైవింగ్ అందిస్తున్నామని చెప్పారు.

పోతులూరులో గడప గడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : వైసీపీ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం జగన్ మోహన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ ధ్యేయంగా పరిపాలన అందిస్తున్నారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పోతులూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సర్పంచ్ బోండు రాంబాబు, మాజీ సర్పంచ్ పంచాది వీరబాబు, మాజీ ఎంపిటిసి నాగులపల్లి బాబ్జిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రత్తిపాడు నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటికే 83వ రోజు నిర్వహించారు. ఎమ్మెల్యేను చీరల మీద నడిపించి పూలు వర్షం కురిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందజేయాలన్నారు. ఈ ఎంపీపీ గోళ్ళ క్రాంతి సుధాకర్, వైసిపి మండల కన్వీనర్ బెహరా దొరబాబు, వైసిపి మండల పొలిటికల్ మేనేజర్ రామిశెట్టి చినబాబు, పోతులూరు వాకపల్లి ఎంపిటిసి ముప్పుడి ఏసుబాబు, సర్పంచ్ రొంగల నాగేశ్వరరావు, బారువాక సర్పంచ్ దొడ్డి సత్యనారాయణ, ఉప సర్పంచ్ బర్ల చక్రం, పినిశెట్టి ప్రకాష్, మామిడి నరసింహమూర్తి, బర్ల నాగరాజు, ఫిషరీస్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, అధికారులు, పంచాయతీ వార్డు మెంబర్లు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, అంగన్వాడి సిబ్బంది, డ్వాక్రా యానిమేటర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశానికి ప్రధాన శాఖల అధికారులు డుమ్మా

విశాలాంధ్ర - కాజులూరు : కాజులూరు మండల పరిషత్ సమావేశ భవనంలో గురువారం జరిగిన మండల సర్వసభ్యసమావేశం సాదాసీదాగా జరిగింది. అయితే సభకు పలు ప్రధాన శాఖల అధికారులు డుమ్మా కొట్టడంతో సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. వివరాల్లోనికి వెళ్లితే ఎంపీపీ మాత భారతి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి జెడ్పీటీసీ సభ్యుడు వనం వెంకటసుసుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరవ్వగా ఎంపిడిఓ డివిఎస్ శర్మ వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముందుగా హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో ఈ ఏడాది 1545 ఇళ్లస్థల పట్టాలు పంపిణీ చెయ్యగా వాటిలో 1254 గృహనిర్మాణాలు మంజూరయ్యాయన్నారు. 327 నిర్మాణదశలో ఉండగా మరో 1927 ఇల్లు ప్రారంభం కావలసి ఉందన్నారు. అదేవిదంగా మండల ఇంజనీరింగ్ అధికారి మాట్లాడుతూ మండలంలో 1.30 కోట్లతో సీసీ రోడ్లు మంజూరుకాగా రూ. ఐదుకోట్లతో పలు గ్రామీణ రహదారులలో బీటి రోడ్లు మంజూయ్యాయన్నారు. ఆర్ డబ్ల్యూస్ ఏఈ మాట్లాడుతూ మండలంలో జలజీవన్ మిషన్ ద్వారా 23.96 కోట్లు మంజూరవ్వగా పనులు వేగవంతంగా జరుతున్నాయన్నారు. అయితే ప్రదానంగా వ్యవసాయశాఖ, డ్రెయిన్స్, రెవిన్యూ, నీటిపారుదల శాఖల నుంచి అధికారులేవ్వరూ సభకు హాజరుకాకపోవటంతో సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. వ్యవసాయ ఆధారితమైన మండలంలో అందుకు అనుసందానమైన అధికారులు లేకపోతే తమ సమస్యలను ఎవ్వరికి చెప్పుకోవాలి అంటూ మతుకుమిల్లి సర్పంచ్ పెట్టా వీరనాయుడు, పల్లిపాలెం ఎంపీటీసి సభ్యులు మేడిశెట్టి శ్రీను తదితరులు వాపోయారు. ఎంపీడిఓ శర్మ, జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకటసుసుబ్బారావులు స్పందిస్తూ సంబంధిత శాఖల అధికారులతో సభ్యులకు శుక్రవారం మరో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇస్తూ వారిని శాంతిపజేసారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ, మండలంలోని 26 గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

కొమ్మినేనికి అభినందనలు తెలిపిన దివి జర్నలిస్టులు

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ కార్యాలయం(విజయవాడ) లో నూతన చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన కొమ్మినేని శ్రీనివాసరావుని దివిసీమ సీనియర్ జర్నలిస్ట్ లు గురువారం కలసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా కొమ్మినేని కి శుభాకాంక్షలు చెప్పి దుశ్శాలువలతో సత్కరించారు. ఆయనను కలసిన వారిలో సింహాద్రి కృష్ణప్రసాద్ అప్పికట్ల శ్రీనివాసరావు సామర్ల మల్లికార్జునరావు లేబాక నాగేశ్వరావు ఉన్నారు. కొమ్మినేని వారితో మాట్లాడుతూ జర్నలిస్టుల అందరి సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామన్నారు. దివిసీమ పర్యటనకు రావాలని కొమ్మినేని ని ఆహ్వానించగా జర్నలిస్ట్ లకు ఉపయోగపడే మంచి కార్యక్రమం ఏర్పాటు చేయండి తప్పకుండా హాజరవుతానని సానుకూలంగా స్పందించారు.

స్వామిత్వా తోనే సమగ్ర అభివృద్ధి సాధ్యం!

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన సమాచారాన్ని వివిధ రూపాలలో సేకరించటం ద్వారా మాత్రమే ఆయా గ్రామాలలో సమగ్ర అభివృద్ధి రూపకల్పన సాధ్యమౌతుందని ఎమ్.పి.డి.ఓ. శ్రీనివాస్ గురువారం చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్వామిత్వా పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ బృహత్ కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. తొలిదశలో ఆయా గ్రామాలకు చెందిన భూ ఉపరితలం పై డ్రోన్‌ల సహాయంతోనూ, రెండవ దశలో సరిహద్దుల నిర్ధారణ పైనా, మూడవ దశలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారని ఎమ్.పి.డి.ఓ. తెలిపారు. గ్రామాలలో నివశిస్తున్న ప్రజల అవసరాలను గుర్తించేందుకు వారి వారి ఆర్థిక, జీవన విధానం, ఆరోగ్య స్థితి గతుల వంటి వాటిపై వివరాలను సేకరిస్తారని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్వేయర్‌తో పాటు పంచాయతీ సిబ్బంది పాల్గొంటారని శ్రీనివాస్ వివరించారు.

డా॥ విజయలక్ష్మికి బ్రౌన్ సాహితీ పురస్కారం

విశాలాంధ్ర - గుడివాడ : తెలుగు భాషాభివృద్ధికి ఆంధ్ర భాషోద్ధారకుడు, చార్లెస్ ఫిలిప్‌బ్రౌన్ చేసిన సేవలు చిరస్మరణీయమని రూరల్ ఎంపిపి గద్దే పుష్పరాణి అన్నారు. గురువారం స్థానిక షా గులాబ్‌చంద్ ప్రధమశ్రేణి గ్రంథాలయంలో తెలుగుబాషా సమితి అధ్వర్యంలో సిపి బ్రౌన్ 224వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిపి పుష్పరాణి మాట్లాడుతూ వేమన పద్యాలను ఆంగ్లభాషలోకి అనువదించిన బ్రౌన్ తెలుగు భాషాకు ఎంతగానో కృషి చేశారన్నారు. అనతరం ప్రొఫసర్ డా॥ మండవ విజయలక్ష్మికి బ్రౌన్ 20222 సాహితీ పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషా సమితి సమన్వయకర్త డిఆర్‌బి ప్రసాద్, గ్రంథాలయ అధికారిణీ కె.రామదేవి, సాహితీ వేత్తలు బివివి రమణ, డి.ఆనందమోహనబోసు, అవిరినేని వెంటేశ్వరరావు, సిహెచ్ శ్రీదేవి, ఆర్.వేణుబాబు, ఆర్‌కె రెడ్డి, నవీన్, సురేష్ మోహనబాబు, గ్రంథాలయ సిబ్బంది శాంతి, రవిచంద్ర, ప్రవల్లిక తదితరలు పాల్గొన్నారు.

గడపగడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర - గుడివాడ : స్థానిక 7వ వార్డులో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అధికార యంత్రాంగంతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు మహిళలు త్రాగునీరు, పెన్షన్లు, టిడ్కో గృహాలు, శానిటేషన్ తదితర సమస్యలను కొడాలి నాని దృష్టికి తీసుకు వచ్చారు. అనంతరం రూ.14లక్షలతో నిర్మించే సిసి రోడ్డు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మండలి హనుమంతరావు, పాలేటి చంటి, పలు శాఖల ప్రభుత్వ అధికారులు, సచివాలయం సిబ్బంది, పాల్గొన్నారు.

స్థలంపై గద్దల కన్ను

విశాలాంధ్ర-మచిలీపట్నం టౌన్ : స్థానిక ఇనగుదురుపేటలోని తన స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు రౌడీషీటర్ లు ప్రయత్నిస్తున్నారని మహ్మద్ అలీఖాన్ గురువారం మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. తాతల ముత్తాతల వాసత్వానికి సంబంధించిన మా కుటుంబానికి చెందిన ఖాళీ స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని మా కుటుంబాన్ని వీధిపాలు చేయాలని చూస్తున్నారని అలీ ఖాన్ ఆవేదన కన్నీటి పర్యంతమైంది. తనకుటుంబంలో ఆరుగురు సంతానంలో వికలాంగులైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, తన గోడు వెళ్లబోసుకున్నారు. ఈ విషయం పై ఉన్నతాధికారులకు స్పందన కార్యక్రమం లో ఫిర్యాదు చేశానని, తనకు తన కుటుంబానికి న్యాయం చేయాలని మీడియా ముందు ఆయన విన్నవించారు. బిజెపి మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజా భాయ్ మాట్లాడుతూ బాధితులకు న్యాయం జరిగే వరకూ పార్టీ తరపున అండగా ఉంటామన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు బాధితునికి వెంటనే న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.